క్లుప్తంగా

'డేటా' అనలిస్టులకు మంచి భవిత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాబోయే కాలంలో డేటా అనలిస్టులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రముఖ డేటా ఎనలిస్ట్ శ్రవణ్‌రామ్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రవణ్‌రామ్ మాట్లాడుతూ డేటా వనరుల నుంచి సమాచారాన్ని పొందడం, శక్తివంతమైన డేటా ట్రాన్స్‌ఫర్మేషన్, డేటా ఇన్‌సైట్ వంటి అంశాలను సృష్టించడానికి ఉపయోగించే అత్యాధునిక సాఫ్ట్‌వేర్ గురించి వివరించారు. మొబైల్ అప్లికేషన్లు, వెబ్ అప్లికేషన్లు అత్యంత వేగంగా, సమగ్రంగా, ఆధునికంగా తయారుచేసే అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రామ్‌పవన్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 3నుంచి నగరంలో ట్రేడ్ ఎక్స్‌పో -2025



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో వచ్చే జనవరిలో స్మైలీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ట్రేడ్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి తెలిపారు. జనవరి 3,4,5 తేదీలలో నగరంలోని వెన్యూ కన్వెన్షన్‌లో ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. శుక్రవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఎక్స్‌పో-2025 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రేడ్ ఎక్స్‌పోలో హాస్పిటాలిటీకి రంగానికి చెందిన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆ రంగంలోని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిల్డింగ్ వర్కర్స్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గద్దం రవి కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీ



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య 141 వ జయంతి సందర్భంగా గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సంగీత విద్వాంసురాలు కమల దీప్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. పచ్చమిరియం భైరవి రాగంతో ప్రారంభించి ముత్తు స్వామి దీక్షితార్ కీర్తన హేరంబాయ నమస్తే, శ్యామశాస్త్రి కీర్తన నన్నుబ్రోవు లలిత, త్యాగరాజ స్వామి కీర్తన చలమేలరా, మనములేద, ముత్తయ్య భాగవతార్ కీర్తన వంచతోను కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై హరిబాబు సహకరించారు. శనివారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన సాతూరు కృష్ణ రామరత్నం కచేరీ ఉంటుందని స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

జూపూడికి సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావును పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విద్యాధరపురానికి చెందిన దాసి జయప్రకాష్ కెనడీ అభినందించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జూపూడిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కెనడీ కృతజ్ఞతలు తెలియ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని హెచ్ ఐజీ వరకు కరెంట్ నిలిపివేస్తామన్నారు.

ఎర్రకట్ట భద్రత ప్రశ్నార్థకం..?

- శిథిలావస్థకు చేరుకున్న రైల్వే బ్రిడ్జిలు
- ఆక్రమణలతో కుచించుకుపోతున్న కట్ట
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం



రైల్వే బ్రిడ్జికి ఇనుప గడ్డర్‌లతో తాత్కాలిక మరమ్మతులు చేసిన రైల్వేశాఖ

వించిపేట(విజయవాడపశ్చిమ): నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఎర్రకట్ట రహదారి రోజురోజుకు కుచించుకుపోవడంతో పాటు ఈ రహదారిపై నిర్మాణం చేసిన రెండు రైల్వే బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదభరితంగా మారాయి. దీంతో ఈ రహదారిపై వాహనదారులు భయందోళన మధ్యే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గొల్లపూడి నుంచి భవానీపురం, చిట్టినగర్ మీదుగా బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, ఏలూరు రోడ్డు, నూజివీడు, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనదారులు ఎక్కువగా ఎర్రకట్ట రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల ఇరుముడులు, నగరంలో వీఐపీల రాకపోకల సందర్భాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినప్పుడు నగరంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనదారులు ఎర్రకట్ట రహదారిమీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ రహదారి నేడు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేశాఖ నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయందోళన చెందుతున్నారు.

35 సంవత్సరాల క్రితం నిర్మాణం.....

ఎర్రకట్ట రహదారిలో రెండు ప్రధాన రైల్వే లైన్‌లు ఉండటంతో సుమారు 35 సంవత్సరాల కిత్రం రైల్వేశాఖ రెండు బ్రిడ్జిలను నిర్మాణం చేసింది. దీనికి అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఎర్రకట్ట దహదారి ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి పశ్చిమ నియోజకవర్గం నుంచి తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాలకు సులువుగా వెళ్లేందుకు వాహనదారులకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఈ బ్రిడ్జిల సైడు రక్షణ గోడలు కూలిపోవడం, ఫోర్‌మెన్‌బంగ్లా వద్ద బ్రిడ్జి రిటైనింగ్ వాల్స్ పగుళ్లు ఏర్పడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. దీనిపై స్థానికుల ఆందోళన చేపట్టడంతో రెండేళ్ల క్రితం రైల్వే అధికారులు ఇనుప గడ్డర్‌లతో రిటైనింగ్ వాల్స్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు.

ఆక్రమణలతో ఎర్రకట్ట...

పెజ్జోనిపేట, కంసాలిపేట ప్రాంతంలో కొంత మంది ఎర్రకట్ట మట్టిని తొలగించి ఆక్రమణలు చేపట్టారు. దీంతో ఎర్రకట్ట పటిష్టత కోల్పోయి రోజురోజుకు మట్టి జారిపోయి కట్ట కుచించుకుపోతుంది. దీని కారణంగా రహదారి సైడులు కుంగి, దానిపై ఏర్పాటు చేసిన రైలింగ్‌లు కూడా జారిపోయాయి. దీని కారణంగా తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నగర పాలక సంస్థ అధికారులు ఎర్రకట్ట ఆక్రమణలు అడ్డుకుని కట్ట వెంబడి రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేసి పటిష్టతను పెంచాలంటు పలువురు వాహనదారులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలతో బెంబేలు

ఎర్రకట్ట రహదారి సైడులు కుంగిపోయి ప్రమదాదకరంగా మారటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా రాత్రుళ్లు ఎర్రకట్ట మీదుగా లారీలు, టిప్పర్‌లు వంటి భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తుండటంతో అంతంతమాత్రన ఉన్న ఎర్రకట్ట పటిష్టత దెబ్బతిని సైడులు కుంగి గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



పట్టుజారుతున్న ఎర్రకట్ట రహదారి



ఆక్రమణల గురైన ఎర్రకట్ట

విద్యతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు విద్యతో పాటు వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యస్.శ్రీనివాసరావు తెలిపారు. నలంద డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మేనేజ్‌మెంట్ మీట్ బ్రెయిన్ స్ట్రోమర్స్ 2కే 24 ఉత్సాహంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువును మార్కుల కోసమే కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్, నాయకత్వపు లక్షణాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీపీటీ, క్విజ్, ప్రొడక్ట్ లాంచింగ్, అంత్యాక్షరి, గ్రూప్ డ్యాన్స్, పర్సనాలిటీ కాంటెస్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ, ఇన్‌స్టారీల్, డాన్స్, బిజినెస్ ప్లాన్, యంగ్ మేనేజర్ వంటి పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ యం.అనురాధ, మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ వై.శ్రీలక్ష్మి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆరు నెలల్లోనే కూటమికి తీవ్ర ప్రజావ్యతిరేకత

- వైఎస్సార్ సీపీ నేతలు వెలంపల్లి, మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి
- అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న విష్ణు, వెలంపల్లి, భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాడు రచించిన భారత రాజ్యాంగాన్ని నేటికీ అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం మంత్రి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుండటం బాధాకరమని వైఎస్సార్ సీపీ నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నో అరాచకాలు, అన్యాయం, అధర్మంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి లోకేష్ ముందుగా చెప్పినట్లే ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతున్న ప్రతి ఒక్కరినీ అనేక సాకులు చూపి అరెస్టులు చేసి జైల్లో పెడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందని తెలిపారు. ఈ ప్రభుత్వం దిగిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

ప్రశ్నించినవారిపై కక్ష సాధింపు చర్యలు...

కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రశ్నించటమే నేరంగా వారిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు మండిపడ్డారు. రెడ్ బుక్ రాజ్యాంగం మేరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించి వారి కుటుంబాలను క్షోభ పెడుతున్నారని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు సంబంధించి సామాజిక న్యాయం పాటించని ప్రభుత్వానికి పాలించే హక్కు లేదన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో అవకాశాలు లభించే విధంగా రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి అన్ని వర్గాల ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు కాలే పుల్లారావు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు షేక్ ఆసిఫ్, నాయకులు డొడ్డ అంజిరెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, విద్యార్థి విభాగం నాయకుడు రవిచంద్ర, ఎస్సీ సెల్ నాయకులు కామళ్ల జోజి, గుండె సుందర్‌పాల్, బోడా ప్రేమ్, గోమతోటి వినోద్, యర్రజొన్నల విజయలక్ష్మి, చంద్రలీల, ఇందుపల్లి సుభాషిణి, కలపాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా బీఆర్ అంబేడ్కర్ సేవలు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మీ తదితరులు

వించిపేట(విజయవాడపశ్చిమ): చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా అంబేడ్కర్ సేవలు అందించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో వించిపేట, నైజాంగేటుసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలు డివిజన్‌ల కార్పొరేటర్లతో కలసి ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల ప్రజల స్వేచ్ఛ, సమానత్వం కోసం తుదివరకు కృషి చేసిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని కొనియాడారు. సమసమాజ స్థాపన, సామాజిక సమానత్వం, దేశాభివృద్ధి ఆయన రచించిన రాజ్యాంగం ద్వారానే సాధ్యమైందని చెప్పారు. అటువంటి మహనీయుని ఆశయాలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో వినూత్న పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా లినిచారని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో భారతరత్న డాక్టర్ బీఆర్ ఆంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలవుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు బాలసాని మణెమ్మ, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, షేక్ హయత్, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్, నాయకులు కర్నాటి రాంబాబు, మనోజ్ కోఠారి పాల్గొన్నారు.



బాప్టిస్టనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శరత్‌బాబు



కేదారేశ్వరపేటలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుట్టి రాయప్ప తదితరులు

మహనీయుడు బీఆర్ అంబేడ్కర్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహనీయుడు భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం 35వ డివిజన్ బాప్టిస్టనగర్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ బి.మణిమ్మతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శరత్‌బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాజు తదితరులు పాల్గొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో కేదారేశ్వరపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాళ్ల చిన్నప్ప, ప్రకాశరావు, వేలంగమ్మ తదితరులు పాల్గొన్నారు. ఖుద్దూస్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు టి.బాలశౌరి, జయప్రకాష్,

అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంటరానితనంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు సమాజంలో సముచితస్థానం కల్పించే దిశగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం డీఆర్ఎం కార్యాలయంలో 'మహాపరినిర్వాణ్ దివాస్' కార్యక్రమం నిర్వహించారు. డీఆర్ఎం ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే గొప్ప రాజనీతిజ్ఞుడుగా అంబేడ్కర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. పేదరికంలో పుట్టిన అయన కృషి, పట్టుదలతో ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన అపర మేధావిగా అభివర్ణించారు. ఆయన జీవిత చరిత్రను అందరూ ఆదర్శంగా తీసుకుని సమసమాజస్థాపన దిశగా ముందకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, పీఆర్ఓ నుస్రత్ ముంద్రుప్కర్, అలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు, పలు ట్రేడ్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

మహానటి సావిత్రి నటన భావి నటులకు ఆదర్శం



భూపాల్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: మహానటి సావిత్రి నటన భావి నటులకు ఆదర్శమని సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య- సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సావిత్రి జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ సావిత్రి లేని తెలుగు చిత్రసీమను ఊహించలేమన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన జనార్దన్, జేడీ లక్ష్మీనారాయణ, రోజా ప్రసన్నలత, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నవరంగ్ థియేటర్ అధినేత వాసిరెడ్డి భూపాల్ ప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నాదామృతం నాగలక్ష్మి మృదంగ విన్యాసం



విజయవాడ కల్చరల్: డాక్టర్ మండపాక నాగలక్ష్మి మృదంగ విన్యాసం అనన్య సామాన్యమని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. సంగీత సమ్రాట్ ఎస్పీబాల సుబ్రహ్మమణ్యం స్మారక సంస్థ, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, కేవీ బ్రహ్మానందరావు సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద అంతర్జాతీయ సంగీత విద్వాంసురాలు అదితీ బీ ప్రహ్లాద్ గాత్ర కచేరి మృదుమధురంగా సాగింది. అనంతరం మృదంగ విద్వాంసురాలు, విజయనగరం సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఎంవై శేషురాణి, ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, మండపాక నాగలక్ష్మి సంగీత సేవలను వివరించారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, కేఎస్ పూర్ణచంద్రిక పాల్గొన్నారు.

సనాతన ధర్మం కాదు..సమ ధర్మం కావాలి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు



గొల్లపూడి అంబేడ్కర్ హైస్కూల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు



47వ డివిజన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ మిషన్ ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. మనకు కావాల్సింది సనాతన ధర్మం కాదని.. సమ ధర్మం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్, దళిత సోషల్ విముక్తి నాయకులు అంద్ర మల్యాద్రి, నటరాజ్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విద్యా అకాడమీలో....

గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సిద్ధార్థ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ విఠల్‌రావుతో పాటు డాక్టర్ అశోక్ రెడ్డి, న్యాయవాదులు ఎం దేవదానం, కేజేఎస్ ప్రకాశరావు, ఆవుల వెంకటరావు (ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు) పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమాన్ని అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్.సత్యనారాయణ, ఆర్ గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరుణ్ బాబు నిర్వహించారు. 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రమణ, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కమలాకర్, క్రాంతి కుమార్, బోయళ్ల రాజేష్, వెంకటేష్, మైనార్టీ నాయకులు షేక్ రషీద్, బాబు తదితరులున్నారు.

కనకదుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపైగల దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై కళాకారులు తమ నృత్యంతో కనకదుర్గమ్మకు నీరాజనాలు సమర్పించారు. విశాఖపట్నం సిరిపురంలోని జిల్లా బాల భవన్ (గవర్నమెంట్ ఆఫ్ ఏపీ)కు చెందిన నాట్యాచారిణి లలిత శ్రీనివాస్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఏకదంతాయ, మూషిక వాహన, నమస్తేస్తు మహామాయే లక్ష్మీ స్తుతి, సరస్వతి స్తుతి, గణపతి తాళం, బాల గోపాల తరంగం వంటి 13 అంశాలకు కళాకారిణులు చక్కని ఆంగికాభినయంతో నర్తించారు. ఈవో కెఎస్ రామరావు చిన్నారులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. డెప్యూటీ ఈఓ రత్నరాజు, ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ శాస్త్రి, ధూపాటి శ్రీదేవి పాల్గొన్నారు.